ఫెర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు

బీర్కూర్‌లోని ఓ దుకాణంలో స్టాక్ వివరాలను పరిశీలిస్తున్న ఏవో కమల

నస్రుల్లాబాద్ మే 17: బీర్కూర్ మండలంలోని బరంగేడ్గి, తిమ్మాపూర్, బీర్కూర్ గ్రామాల్లోని ఎరువులు, పురుగుల మందు, విత్తనాల దుకాణాల్లో మండల వ్యవసాయ అధికారిణి కమల శుక్రవారం తనిఖీలు చేశారు. దుకాణాల్లోని స్టాక్ వివరాలను పరిశీలించారు. నమూనాలను సేకరించి హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించినట్లు ఆమె తెలిపారు.

చిన్నమల్లారెడ్డి గ్రామశివారులో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కామారెడ్డి రూరల్ , మే 17: కామారెడ్డి మండలం దేవునిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిన్నమల్లారెడ్డి గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు 50 నుంచి 60 ఏండ్ల వరకు ఉంటుందని, శవం పూర్తిగా కుళ్లిన స్థితిలో ఉందని పేర్కొన్నారు. సుమారు వారం రోజుల క్రితం మృతిచెందినట్లు తెలిపారు. మృతదేహం మెడలో చిన్న తాయత్తు నల్లటి దారంతో ఉందని, కుడి చేతి ఉంగరం వేలుకు రాగి ఉంగరం ఉందని వివరించారు. ఆనవాళ్లు గుర్తుపట్టినవారు దేవునిపల్లి సీఐ (87126 86148), ఎస్సై (87126 86150)కి సమాచారం ఇవ్వాలని సూచించారు.

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

రాజంపేట్, మే 17: మండలంలోని ఆర్గొండ గ్రామానికి చెందిన చాకలి సిద్ధరాములు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్గొండ గ్రామ శివారులో ఈ నెల 12న అర్ధరాత్రి బహిర్భూమికి వెళ్లిన కుమ్మరి సత్తవ్వను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదానికి డ్రైవర్ చాకలి సిద్ధరాములు కారణమంటూ కొందరు అనుమానం వ్యక్తంచేస్తూ పరిహారం చెల్లించాలని ఆయనపై ఒత్తిడి చేశారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సిద్ధరాములు గురువారం రాత్రి ఎల్లారెడ్డిపల్లి గ్రామ శివారులోని అడవి ప్రాంతంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతికి కొందరు గ్రామస్తులు కారణమని అనుమానిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సంపత్ తెలిపారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

నస్రుల్లాబాద్, మే 17: గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని ఎంపీపీ రఘు అన్నారు. బీర్కూర్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ...గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని, బోరు మోటర్లు చెడి పోతే వాటిని బాగు చేయించి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో భారతి, సూపరింటెండెంట్ భాను ప్రకాశ్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు

బీబీపేట్, మే 17: మండలంలోని మాందాపూర్ గ్రామంలో గురువారం కురిసిన అకాల వర్షానికి దుబ్బాక శ్రీనివాస్‌కు చెందిన ఇల్లు కూలిపోయింది. ఇల్లు పూర్తిగా కూలిపోయిందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

పాఠశాల ప్రారంభంలోపే పనులు పూర్తిచేయాలి

ఎల్లారెడ్డి జడ్పీహెచ్ఎస్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

- అధికారులకు కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ ఆదేశం
- ఎల్లారెడ్డి, పెద్దకొడప్‌గల్ మండలాల్లో స్కూళ్ల పరిశీలన

ఎల్లారెడ్డి రూరల్, మే 17: పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలో భాగంగా మౌలిక సదుపాయాల కల్పన పూర్తికావాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ ఆదేశించారు. శుక్రవారం ఎల్లారెడ్డి, పెద్దకొడప్‌గల్ మండలాల్లో పర్యటించారు. ఎల్లారెడ్డి పట్టణంలోని జడ్పీహెచ్(బాలికల) పాఠశాల, పెద్దకొడప్‌గల్ మండలంలోని విఠల్‌వాడి గ్రామంలో పాఠశాలను సందర్శించారు. ఎల్లారెడ్డిలో పాఠశాల భవనం స్లాబ్ లీకేజీని, పాఠశాల ఆవరణలో ఉన్న శిథిలమైన గదులను పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడా రు. పాత వాష్ రూమ్‌లకు మరమ్మతులు, కొత్తగా నాలుగు వాష్‌రూమ్‌ల నిర్మాణం, కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న గదుల తొలగింపు పనులు వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. కుళాయిలు, సింకులు, వాటర్ ట్యాంక్ ఏర్పాటు, విద్యుత్ సరఫరా తదితర పనులు పాఠశాలలు ప్రారంభం అయ్యే వరకు పూర్తికావాలని మండల విద్యాధికారి వెంకటేశానికి సూచించారు. విఠల్‌వాడిలో పాఠశాల పైకప్పు శిథిలావస్థకు చేరుకోవడంతో వర్షపునీరు తరగతి గదుల్లోకి వస్తోందని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాల పైకప్పు తొలగించి రేకులు వేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ మహేందర్, ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు, ఏఈ శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు, ఆర్‌అండ్‌బీ డీఈఈ నారాయణ, గిర్దావర్ శ్రీనివాస్, పెద్దకొడప్‌గల్ ఎంఈవో దేవీసింగ్, ఏఈ చందూ, హెచ్ఎం గంగామణి తదితరులు ఉన్నారు.

షీ టీమ్, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన

దోమకొండ, మే 17: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు వద్ద ఎస్సై గణేశ్ ఆధ్వర్యంలో షీటీమ్, ఆన్‌లైన్ మోసాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. అపరిచితుల ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని సూచించారు. ఆన్‌లైన్ మోసాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాల బారినపడిన వారు వెంటనే 1930 నంబర్ ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై ఫిర్యాదుకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు, పోలీసులు

చుక్కాపూర్‌లో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

మండలంలోని చుక్కాపూర్ అటవీ ప్రాంతంలో ఉన్న శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో బ్రహోత్సవాలు ప్రారంభమయ్యాయి. అధ్యయనోత్సవాల్లో భాగంగా శుక్రవారం బాలభోగ నివేదన, తీర్థగోష్ఠి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ ఈవో శ్రీధర్‌రావు తెలిపారు.

–మాచారెడ్డి, మే 17

డిగ్రీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

డిచ్‌పల్లి, మే 17 : డిగ్రీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని టీయూ రిజిస్ట్రార్ యాదగిరి అన్నారు. వర్సిటీలో వివిధ పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పరీక్ష కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్లుగా వ్యవహరించే వారు సమయానికి పరీక్షా కేంద్రంలో ఉండాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అత్యవసర పనులు ఏమైనా ఉంటే అక్కడ పనిచేసే మరో అధికారికి లిఖితపూర్వకంగా బాధ్యతలు అప్పగించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు. ఈనెల 21 నుంచి జూన్ 15వ తేదీ వరకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని 38 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 2, 4, 6 సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు సుమారు 24 వేల మంది, 1, 3, 5 సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 14 వేల మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ముందస్తు సమాచారం ఇచ్చినప్పటికీ కొంతమంది ప్రిన్సిపాళ్లు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సమావేశానికి గైర్హాజరుకావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కొలతల ప్రకారం పనులు చేపట్టాలి

బాన్సువాడ రూరల్, మే 17: ఉపాధి పనులకు వచ్చే కూలీలు కొలతల ప్రకారం పనులు చేస్తేనే కూలీ గిట్టుబాటు అవుతుందని టెక్నికల్ అసిస్టెంట్ గోపాల్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని కోనాపూర్ గ్రామంలో కొనసాగుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. కూలీల హాజరును తనిఖీ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు ఇచ్చిన కొలతల ప్రకారం తప్పని సరిగా పనులు చేయాలన్నారు. కొలతల ప్రకారం పనులు చేస్తేనే పూర్తిస్థాయి కూలీ వస్తుందని తెలిపారు.

ధాన్యం అన్‌లోడింగ్‌లో ఇబ్బందుల వల్లే జాప్యం

జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్‌బాబు

కామారెడ్డి, మే 17: కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్యపడొద్దని జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు సూచించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైస్ మిల్లుల్లో గత యాసంగి, వానకాలానికి సంబంధించిన ధాన్యం నిల్వలు ఉండడంతో స్థలం సరిపోవడంలేదని తెలిపారు. ప్రస్తుత యాసంగి ధాన్యం అన్‌లోడ్ చేసుకోవడంలో జాప్యం నెలకొన్నదని పేర్కొన్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా స్థలాన్ని సర్దుబాటు చేసుకొని త్వరగా అన్‌లోడ్ చేసుకొని, లారీలను తిప్పి పంపించాలని రైస్ మిల్లుల యాజమాన్యాలను ఆదేశించినట్లు తెలిపారు. ధాన్యాన్ని ఇతర జిల్లాలకు తరలించడానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. నిజాంసాగర్ మండలం కోమలంచలో ధాన్యం సేకరణ ప్రక్రియలో జాప్యం నెలకొనడంతో రైతులు ఆందోళన చేపట్టగా సమస్యను వెంటనే పరిష్కరించినట్లు తెలిపారు.

ఉన్నత చదువుల కోసం దరఖాస్తులు చేసుకోవాలి

కామారెడ్డి, మే 17: నేషనల్ ఓవర్సీస్ స్కాలర్ షిప్ పథకం కింద 2024-25 సంవత్సరంలో ఉన్నత చదువుల కోసం గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 31 లోపు https://overseas.tribal.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించాలని సూచించారు.

జిల్లా కేంద్రంలో భారీ వర్షం

ఎన్‌హెచ్ -7 రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

కామారెడ్డి,మే 17 : జిల్లా కేంద్రంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ, ఉక్కపోతగా ఉన్న వాతావరణం సాయంత్రం ఒక్కసారిగా మేఘావృతమైంది. గంటకు పైగా వర్షం కురవడంతో పట్టణంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఎన్‌హెచ్ -7 రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అడ్లూర్ ఎల్లారెడ్డిలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయ్యింది. వడ్ల కుప్పల చుట్టూ వరద నీరు నిలిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అవిశ్వాసం నెగ్గేనా.. వీగేనా..?

కలెక్టర్ జితేశ్ వీ పాటిల్‌కు తీర్మాన పత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు(ఫైల్)

- నేడు ఎల్లారెడ్డి బల్దియా చైర్మన్ అవిశ్వాసంపై ప్రత్యేక సమావేశం
- హైదరాబాద్ నుంచి నేరుగా ఎల్లారెడ్డికి రానున్న కౌన్సిలర్లు

ఎల్లారెడ్డి, మే 17: ఎల్లారెడ్డిలో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణపై అవిశ్వాసం పెట్టడం రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. ఎల్లారెడ్డి బల్దియాలో మెజార్టీ కౌన్సిలర్లు బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు ఉన్నారు. దీంతో పాలకవర్గం ఏర్పడి నాలుగేండ్లు గడిచినా.. అవిశ్వాసం అనే మాటే రాలేదు. కాగా.. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బల్దియా చైర్మన్ సత్యనారాయణ బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వెంటనే కౌన్సిలర్లు కలెక్టర్ జితేశ్ వీ పాటిల్‌ను కలిసి అతడిపై అవిశ్వాసం ప్రకటిస్తూ తీర్మానం చేసిన కాపీని ఏప్రిల్ 24న అందజేశారు. మెజార్టీ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రకటించడంతో కలెక్టర్ ఈనెల 18వ తేదీన సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతో అవిశ్వాసం కోరిన 11 మంది కౌన్సిలర్లు తమ కుటుంబ సభ్యులతో కలిసి విహారయాత్రకు బయల్దేరి వెళ్లారు. దేశ రాజధాని ఢిల్లీతోపాటు హిమాచల్ ప్రదేశ్‌లోని పలు పర్యాటక ప్రాంతాలను సందర్శించారు.

నేడు ఎల్లారెడ్డికి..

లోక్‌సభ ఎన్నికల ఓటింగ్ అనంతరం విహారయాత్రకు వెళ్లిన కౌన్సిలర్లు శనివారం ఎల్లారెడ్డికి చేరుకోనున్నట్లు తెలిసింది. ఓటు వేసిన వెంటనే ఈనెల 14వ తేదీన ఎల్లారెడ్డి నుంచి దేశ రాజధాని ఢిల్లీకి వెళ్లారు. అక్కడ ఒక రోజు ఉండి అనంతరం హిమాచల్ ప్రదేశ్ బయల్దేరి వెళ్లి పలు పర్యాటక ప్రదేశాలను సందర్శించారు. కౌన్సిలర్లు శుక్రవారం ఉదయం ఢిల్లీకి, అక్కడి నుంచి సాయంత్రం హైదరాబాద్‌కు చేరుకున్నట్లు సమాచారం. శనివారం ఉదయం వారందరూ నేరుగా ఎల్లారెడ్డికి వస్తారని తెలిసింది.

ఉదయం 11గంటలకు సమావేశం..

ఎల్లారెడ్డి బల్దియా చైర్మన్ కుడుముల సత్యనారాయణపై కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టగా.. శనివారం ఉదయం 11 గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ శుక్రవారం తెలిపారు. నిబంధనల ప్రకారం సమావేశం నిర్వహిస్తామన్నారు. ఎన్నికల అధికారిగా ఉన్న తాను సమావేశానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ఎత్తిపోతలకు రైతులు సహకరించాలి

బాన్సువాడ ఆర్డీవో రమేశ్‌రాథోడ్

నిజాంసాగర్, మే 17: మండలంలోని మంజీరా నదిలో నిర్మిస్తున్న నాగమడుగు ఎత్తిపోతల పథకానికి రైతులు సహకరించాలని బాన్సువాడ ఆర్డీవో రమేశ్‌రాథోడ్ కోరారు. కొమలంచ గ్రామంలో 39గుంటల భూమి ఎత్తిపోతల నిర్మాణానికి అవసరం ఉన్నదని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ రైతులతో శుక్రవారం సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. ఎకరానికి రూ.25లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని రైతులు అధికారులను కోరారు. ప్రాజెక్టుపైనుంచి రోడ్డును నిర్మిస్తే పది గ్రామాల ప్రజలకు మేలు జరుగుతుందని ఆయా గ్రామాల ప్రజలు కోరారు. సమావేశంలో ప్రాజెక్టు ఈఈ సాల్మాన్, ఏఈ రాజ్‌కమల్, తహసీల్దార్ క్రాంతికుమార్, కార్యదర్శి రవీందర్, గ్రామ పెద్దలు గంగారెడ్డి, నాగభూషణం, ఖాలిక్ తదితరులు పాల్గొన్నారు.

కొమలంచలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో రమేశ్ రాథోడ్

సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం సుధాకర్

బీమా రెన్యువల్ చేయించుకోవాలి

రామారెడ్డి, మే 17: మహిళా సంఘాల్లోని సభ్యురాళ్లు బీమాను రెన్యువల్ చేయించుకునేలా చూడాలని ఐకేపీ డీపీఎం సుధాకర్ వీవోఏలకు సూచించారు. సదాశివనగర్‌లోని మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం వీవోఏలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతినెలా రుణాలను సక్రమంగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీఎం రాజారెడ్డి మాట్లాడుతూ.. వీవోఏలు తమ విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. పుస్తక నిర్వహణ సరిగా చేపట్టాలని, పాఠశాల యూనిఫారాలు కుట్టడానికి ఒక్కో డ్రెస్‌కు రూ.50 చెల్లిస్తారని తెలిపారు. డీపీఎంలు రవీందర్‌రావు, సురేశ్‌కుమార్, సీసీలు అబ్బ లింగం, దర్ని అంజయ్య, నరేందర్‌రెడ్డి, రాములు, కృష్ణాంజలి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలి

డీఆర్డీవో చందర్‌నాయక్

రామారెడ్డి, మే 17: ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని డీఆర్డీవో చందర్‌నాయక్ అన్నారు. సదాశివనగర్ మండలంలోని లక్ష్మీనాయక్ తండా, యాచారం గ్రామాలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని నర్సరీలు, ఉపాధి హామీ పనులు చేపడుతున్న ప్రదేశాలను పరిశీలించారు. యాచారం గ్రామంలో ఉన్న నర్సరీలో పూలమొక్కలు, కరివేపాకు మొక్కలను ఎక్కువగాపెంచాలని గ్రామ కార్యదర్శి వెంకట్‌కు సూచించారు. ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచడంతోపాటు ప్రతి రోజూ రూ.300 కూలి వచ్చేలా పని చేయించాలన్నారు. రైతులకు ఉపయోగపడేలా ఫార్మేషన్ రోడ్లు వేయించాలన్నారు. ఆయనతోపాటు ఏపీవో మధు, టెక్నికల్ అసిస్టెంట్లు ఉన్నారు.

ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడుతున్న డీఆర్డీవో చందర్‌నాయక్

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

డీఎల్పీవో నాగరాజు

బిచ్కుంద, మే 17: పంచాయతీ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని డీఎల్పీవో నాగరాజు అన్నారు. బిచ్కుంద పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ విధులకు ఆలస్యంగా వస్తున్నాడని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం గ్రామ పంచాయతీని సందర్శించారు. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని కార్యదర్శిని హెచ్చరించారు. జీపీ రికార్డులను తనిఖీ చేశారు. మండల కేంద్రంలో పారిశుద్ధ్య పనులపై అసంతృప్తిని వ్యక్తంచేశారు. గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారా లేరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పారిశుద్ధ్య పనులు చేయించాలని కార్యదర్శిని ఆదేశించారు. జీపీకి మినీ ట్రాక్టర్‌ను ఏర్పాటు చేసుకోవాలని, పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని సూచించారు. పంచాయతీ సిబ్బంది హన్మంత్ రావు, వీరేశం, కిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్న డీఎల్పీవో

చెరువు మరమ్మతుకు రూ.4లక్షలు మంజూరు

రామారెడ్డి, మే 17: మండల కేంద్రంలోని రంగ చెరువు మరమ్మతుకు రూ.నాలుగు లక్షల నిధులు మంజూరైనట్లు జడ్పీటీసీ నారెడ్డి మోహన్ రెడ్డి శుక్రవారం తెలిపారు. చెరువు అలుగు తెగిపోవడంతో అందులోకి వచ్చిన నీరు వృథాగా వెళుతున్నది. విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకుపోవడంతో ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్ నిధులు మంజూరు చేశారు. చెరువు మరమ్మతుకు నిధులు మంజూరు కావడంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

అందుబాటులో పచ్చిరొట్ట ఎరువులు

ఎల్లారెడ్డి రూరల్, మే 17: ఎల్లారెడ్డి బల్దియా పరిధిలోని గండిమాసానిపేట్ సొసైటీలో పచ్చిరొట్ట ఎరువులు, జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, అవసరం ఉన్న రైతులు తీసుకెళ్లాలని మండల వ్యవసాయాధికారి అనిల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగ విత్తనాలు, పచ్చిరొట్ట ఎరువులు కావలసిన రైతులు శనివారం నుంచి సంబంధిత ఏఈవోల వద్ద సీడ్ పర్మిట్ రాయించుకొని గండిమాసానిపేట్ సొసైటీలో తీసుకోవాలని పేర్కొన్నారు. 30కిలోల జీలుగ విత్తనాల బస్తా 1,116 రూపాయలు ఉంటుందని, రైతులు పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నంబర్లతో ఏఈవోల వద్ద పర్మిట్ తీసుకోవాలని సూచించారు.

క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా సుజిత్

ఎల్లారెడ్డి, మే 17: కాంగ్రెస్ ఎల్లారెడ్డి నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన సుజిత్‌ను నియమిస్తూ ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు శుక్రవారం నియామక పత్రాన్ని అందజేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలను అందిస్తానని సుజిత్ తెలిపారు. ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

మద్నూర్, మే 17: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ శుక్రవారం తెలిపారు. డోంగ్లి మండలం కుర్లా మంజీరా నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా మద్నూర్ మండలంలోని మేనూర్ గ్రామ శివారులో పట్టుకున్నట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు

ఎల్లారెడ్డి రూరల్/గాంధారి, మే 17: మండలంలోని కొక్కొండ గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలను అంజయ్య గురుస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆశ్రమంలో ఉదయం నుంచి స్వామివారికి అభిషేకాలు, అర్చన, కలశస్థాపన, వాస్తుపూజ, జెండా ఆవిష్కరణ, హోమం, దీక్షాధారులు, భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమానికి బీబీపేట్ మండలం నుంచి దీక్షాధారులు హాజరయ్యారు.

గాంధారిలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వేద పండితుడు వేణుగోపాల్ స్వామి బ్రహ్మం గారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కొక్కొండలో నిర్వహించిన ఆరాధానోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

రామారెడ్డి, మే 17: సదాశివనగర్ ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్ మీడియంలో చేరాలనుకునే విద్యార్థులు ఈనెల 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ భానుమతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో 40 సీట్ల చొప్పున అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు www.tsmodelschool.com అనే వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కొనసాగుతున్న వాలీబాల్ శిక్షణా శిబిరం

శిక్షణ పొందుతున్న యువకులు

గాంధారి, మే 17: మండలంలోని రాంపూర్‌గడ్డలో తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి వాలీబాల్ శిక్షణా శిబిరం కొనసాగుతున్నది. ఈనెల 15న ప్రారంభమైన ఈ శిబిరంలో మండలంలోని పలు గ్రామాల యువత శిక్షణ పొందుతున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్‌రాథోడ్ వారికి క్రీడలో మెలకువలను నేర్పుతున్నారు. క్రీడాకారులకు మెరుగైన తర్ఫీదును ఇస్తున్నామని పీఈటీ తెలిపారు.